క్లుప్తంగా

డ్రైడే పాటిస్తే వ్యాధుల నుంచి రక్షణ



ఆర్‌ఎస్ రంగాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

బేతంచెర్ల: ఆరోగ్యంగా ఉండాలంటే వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు ప్రతి శుక్రవారం తప్పని సరిగా డ్రైడే పాటించాలని వైద్యుడు అబ్దుల్ అలీమ్ అన్నారు. డెంగీ మాసోత్సవం సందర్భంగా మంగళవారం మండల పరిధిలోని ఆర్‌ఎస్ రంగాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. దోమలు కుట్టకుండా దోమ తెరలు వాడాలని సూచించారు.

అల్ట్రాటెక్ మైనింగ్‌కు 5 స్టార్ రేటింగ్



కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న కంపెనీ ప్రతినిధులు

కొలిమిగుండ్ల: తుమ్మలపెంట సమీపంలోని అల్ట్రాటెక్ సిమెంట్‌కు చెందిన సున్నపురాయి గనులకు 5–స్టార్ రేటింగ్ దక్కిందని కంపెనీ ప్రతినిధులు మంగళవారం తెలిపారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్ మంత్రిత్వ శాఖ ద్వారా గుర్తింపు లభించిందన్నారు. రాజస్థాన్‌లోని జైపూర్‌లో జరిగిన అవార్డుల ప్రధానోత్సవంలో 5–స్టార్ రేటింగ్ ప్రకటించారన్నారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాజస్థాన్ సీఎం భజన్‌లాల్‌శర్మ చేతుల మీదుగా అవార్డు అందించారని తెలిపారు. సుస్థిరమైన గ్రీన్ మైనింగ్, సాంకేతిక ఆధారంగా ఖనిజ ప్రాసెసింగ్ చేయడం ద్వారా అవార్డు లభించిందని పేర్కొన్నారు.

అధిక వేగంతో నడిపితే చర్యలు

బేతంచెర్ల: రద్దీగా ఉన్న ప్రాంతాలు, పాఠశాలల వద్ద నిర్ణీత వేగంతోనే వాహనాలు నడపాలని డోన్ డీఎస్పీ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం బేతంచెర్ల పట్టణంలోని పలు కూడళ్లను ఆయన పరిశీలించారు. ముఖ్యంగా నాలుగు రోడ్లు కలిసే చోట అప్రమత్తతతో వాహనాలు నడపాలని సూచించారు. ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించాలన్నారు. అనంతరం బుగ్గానిపల్లె, సిమెంట్ నగర్ గ్రామంలో ఎస్సీ, ఎస్టీ కేసులను విచారించారు. ఆయన వెంట ఎస్‌ఐ రమేష్ బాబు ఉన్నారు.


ముగిసిన మొహర్రం



నిమజ్జనానికి తీసుకెళ్తున్న పీర్లు

కొలిమిగుండ్ల: మతసామరస్యానికి ప్రతీకగా జరుపుకునే మొహర్రం వేడుకలు ముగిశాయి. మంగళవారం తిమ్మనాయినపేటలో పీర్లను ప్రత్యేకంగా అలంకరించి మేళతాళాల మధ్య నిమజ్జనానికి తరలించారు. డప్పు వాయిద్యాలు, యువకుల నృత్యాలు, వివిధ రకాల వేషధారణలు ఆకట్టుకున్నాయి. ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. బందార్లపల్లె, కనకాద్రి పల్లె తదితర గ్రామాల్లో మొహర్రం వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.

పెద్దమ్మకు బోనాల సమర్పణ



బోనాలతో వెళ్తున్న మహిళలు

ప్యాపిలి: ఆషాఢమాసాన్ని పురస్కరించుకుని స్థానిక గ్రామదేవత పెద్దమ్మ తల్లికి భక్తులు బోనాలు సమర్పించారు. మేళతాళాల నడుమ మహిళలు సామూహికంగా బోనాలను తీసుకుని ఆలయానికి వెళ్లారు. పెద్దమ్మకు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ నెలలో బోనాలు సమర్పిస్తే వర్షాలు సమృద్ధిగా కురిసి పంట దిగుబడులు బాగా వస్తాయని గ్రామస్తుల నమ్మకం.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల–ఆళ్లగడ్డ ఆర్‌అండ్‌బీ రహదారిలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మంగళవారం మృతి చెందాడు. ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి వివరాలకు మేరకు.. మండలంలోని భీమునిపాడుకు చెందిన శ్యాంబాబు(56) ఈ నెల 3వ తేదీ సొంత పనుల నిమిత్తం బైక్‌పై కోవెలకుంట్లకు వచ్చి రాత్రి స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యాడు. పట్టణ శివారులోని ముక్కెర ఫంక్షన్ హాలు వద్ద బైక్ అదుపు తప్పి కిందపడడంతో గాయపడ్డాడు. స్థానిక ప్రభుత్వాస్పత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం కర్నూలు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.






బనగానపల్లె వైద్యశాలలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న కాటసాని, కొలిమిగుండ్ల: కేక్ కట్ చేస్తున్న జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, కోవెలకుంట్లలో.., బందార్లపల్లె క్రాస్ రోడ్డులో..

మదినిండా వైఎస్సార్

- వాడవాడలా ఘనంగా రాజన్న జయంతి వేడుకలు
- నివాళులర్పించిన పార్టీ నాయకులు, అభిమానులు
- రక్తదానం, సేవా కార్యక్రమాలు



బనగానపల్లెలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె రూరల్: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని మంగళవారం వాడవాడలా ఘనంగా జరుపుకున్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆయా కాలనీలు, గ్రామాల్లోని ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఆయన హయాంలో అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పనులు, రాష్ట్రానికి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. సేవా కార్యక్రమాలతో అభిమానాన్ని చాటుకున్నారు. బనగానపల్లెలో మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి స్వగృహంలో వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు గుండం నాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరాన్ని కాటసాని రామిరెడ్డి ప్రారంభించి రక్తదాతలకు ప్రశంసా పత్రాలను అందజేశారు. అనంతరం కాటసాని నివాసం నుంచి పోలీస్ స్టేషన్ మీదుగా పెట్రోల్ బంక్ సర్కిల్‌లోని వైఎస్సార్ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డితో కలిసి వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. తదనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాటసాని మాట్లాడుతూ.. వైఎస్సార్ అమలు చేసిన ఆరోగ్యశ్రీ, 108, 104, ఉచిత విద్యుత్, ఫీజు రీయింబర్స్‌మెంట్, రుణమాఫీ వంటి పథకాలు అన్ని వర్గాల ప్రజల మనసుల్లో ఆయన్ను చిరస్థాయిగా నిలిపాయని అన్నారు. ఆయన తనయుడు జగన్‌మోహన్‌రెడ్డి కూడా తండ్రి బాటలో నడుచుకుంటూ మరిన్ని సంక్షేమ పథకాలను అమలు చేశారని తెలిపారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం రైతుల మోటర్లకు మీటర్లు ఏర్పాటు చేసి ఉచిత విద్యుత్‌ను నీరుగార్చే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. కరెంట్ బిల్లులు పెంచి పేద, మధ్యతరగతి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్ధంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ జనార్దన్‌రెడ్డి, నాయకులు అత్తార్ జాహెద్, కోడూరు రామచంద్రారెడ్డి, అంబటి రవికుమార్‌రెడ్డి, బీవీ నాగార్జునరెడ్డి, శ్రీనివాస నాయక్, బండి బ్రహ్మానందరెడ్డి, సుధాకర్‌రెడ్డి, నీలి శ్రీనివాసులు, శంకర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, తాహీర్, మహనందిరెడ్డి, వీరారెడ్డి, శివారెడ్డి, బుచ్చిరెడ్డి, నాగశేషుడు, చెన్నారెడ్డి, బాలు, మోహన్‌బాబు, మనోహర్‌రెడ్డి, మాదవరెడ్డి పాల్గొన్నారు.

- **సంజామల:** ముదిగేడు, ఆకుమల్ల గ్రామాల్లో వైస్ ఎంపీపీ రాజశేఖర్ రెడ్డి, పార్టీ నాయకులు గౌరిగారి నాగేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించారు.
- **కోవెలకుంట్ల:** మండల కేంద్రంలోని వైఎస్సార్ విగ్రహానికి వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బీవీ నాగార్జునరెడ్డి, మండల ఉపాధ్యక్షురాలు షాజహాన్, ఏపీ ఎన్జీఓ సంఘం రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు గువ్వల రామకృష్ణారెడ్డి పాలాభిషేకం చేశారు. పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల కోఆప్షన్‌మెంబర్ దిల్కాబాషా, రైతు సంఘం అధ్యక్షుడు కానాల రవీంద్రనాథరెడ్డి, సర్పంచ్‌లు ఎల్వీ సుధాకర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, బాలమద్దిలేటి, నాగేంద్ర, మాజీ జెడ్పీటీసీ చిన్నబాబు, ఎస్టీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసనాయక్, నాయకులు భీమిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, చిక్కేపల్లి రామకృష్ణారెడ్డి, ప్రసాదరెడ్డి, శంకరయ్య, భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, రామసుబ్బారెడ్డి, పోతం రాంమోహన్ రెడ్డి, వీరారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, గడ్డం వరప్రసాదరెడ్డి, పేరా భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.
- **కొలిమిగుండ్ల:** స్థానిక పార్టీ కార్యాలయంలో జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి భారీ కేక్ కట్ చేశారు. వైఎస్సార్ పరిపాలన కాలంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు నేటికీ ప్రజల మదిలో మెదలుతున్నాయని అన్నారు. అలాగే బందార్లపల్లె క్రాస్ రోడ్డులోని వైఎస్సార్ విగ్రహానికి గ్రామ నాయకులు పూలమాలలు వేశారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు లాయర్ మహేశ్వరరెడ్డి, నాయకులు సత్తిగారి రామిరెడ్డి, అంబటి చంద్రమోహన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రామాంజనేయులు, సర్పంచ్‌లు గుర్విరెడ్డి, ఈశ్వరయ్య, వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి, మహేశ్వరరెడ్డి, శివరామిరెడ్డి పాల్గొన్నారు.
- **అవుకు:** వైఎస్ రాజశేఖర రెడ్డి ప్రజలకు చేసిన సేవలు చిరస్మరణీయమని వైఎస్సార్‌సీపీ స్టేట్ పబ్లిసిటీ వింగ్ సెక్రటరీ రామన్న అన్నారు. పార్టీ నాయకులతో కలిసి అవుకులోని పార్టీ కార్యాలయం నుంచి అంబేడ్కర్ కాలనీ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించారు. నాయకులు ముక్కమల్ల పుల్లారెడ్డి, పురుషోత్తం నాయుడు, వాయునందన గౌడ్, సుబ్బు, నర్సిరెడ్డి, జగదీష్, మధు, వలి, రామచంద్రుడు, బాషా, నాగేష్, హరి, శేషు పాల్గొన్నారు.




ముదిగేడులో నివాళులర్పిస్తున్న వైస్ ఎంపీపీ రాజశేఖర్ రెడ్డి, అవుకులో..



కోవెలకుంట్ల: వైఎస్సార్ విగ్రహానికి పాలాభిషేకం

మహానేతకు ఘన నివాళి




డోన్‌లో నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్యాపిలి: కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



బేతంచెర్ల: నివాళులర్పిస్తున్న ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ నాయకులు



శేషారెడ్డి సీహెచ్‌సీలో రోగులకు అన్నదానం

డోన్: రాష్ట్రాభివృద్ధితో పాటు సంక్షేమ పాలనతో వైఎస్సార్ ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేశారని రాష్ట్ర మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు అన్నారు. మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి స్వగృహంలో పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు సోమేష్‌యాదవ్, మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పించారు. అలాగే బేతంచెర్ల రోడ్డు సున్నపుబట్టీల సెంటర్‌లోని వైఎస్ విగ్రహానికి ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి, జెడ్పీటీసీ బద్దల రాజ్‌కుమార్, వలంటీర్ విభాగం జిల్లా అధ్యక్షుడు పోస్టుపసాద్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మల్లెంపల్లె రామచంద్రుడు, వైస్ చైర్మన్ ఓబులాపురం మదన్, వైస్ ఎంపీపీ ఎర్రిస్వామి, ఎంపీటీసీ సభ్యుడు ఓబులాపురం సుధాకర్, నాయకులు కొచ్చెర్వు మధు రెడ్డి, ధర్మవరం శ్రీను, మల్యాల శ్రీనివాసరెడ్డి, వేమారెడ్డి నివాళులర్పించారు. కంబాలపాడు రోడ్డులోని విగ్రహానికి మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, వైస్ చైర్మన్ జాకీర్‌హుసేన్, నాయకులు ఆర్‌ఈ రాజవర్ధన్, కురుకుందు హరి, మిట్టా రవి, దినేష్‌గౌడ్, వంశీ, చంద్ర, ప్రతాప్‌రెడ్డి, గౌస్ నివాళులర్పించారు.

రాజన్న పాలన ఓ స్వర్ణయుగం

ప్యాపిలి: వైఎస్ రాజశేఖర్ రెడ్డి పాలించిన కాలం ఓ స్వర్ణయుగం లాంటిదని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి, రాష్ట్ర బూత్ కమిటీ సెక్రటరీ బొర్రా మల్లికార్జునరెడ్డి, ఏపీఐఐసీ మాజీ డైరెక్టర్ బోరెడ్డి పుల్లారెడ్డి అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వైఎస్సార్ జయంతి, రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పట్టణానికి చెందిన రైతు దంపతులు కృష్ణారెడ్డి, లక్ష్మీదేవిని సత్కరించి దుస్తులు పంపిణీ చేశారు. నాయకులు పోతిరెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి, కమతం భాస్కర్ రెడ్డి, జంగం చంద్రశేఖర్, శ్రీనివాసరెడ్డి, భువనేశ్వర్ రెడ్డి, రజనీరెడ్డి, బషీర్, ప్రభాకర్ రెడ్డి, కొండయ్య పాల్గొన్నారు.

- **బేతంచెర్ల:** పట్టణంలోని శేషారెడ్డి హైస్కూల్ ఎదురుగా ఉన్న వైఎస్ విగ్రహానికి ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, గిడ్డంగుల, ఉర్దూ అకాడమీ, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్లు బాబుల్ రెడ్డి, ముర్తుజావలి, ఖాజా, నాయకులు మురళీధర్‌రెడ్డి, రామచంద్రుడు, మురళీకృష్ణ నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి, ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్‌లు పంపిణీ చేశారు. అదేవిధంగా పట్టణ, మండల కన్వీనర్లు తిరుమలేశ్వర్‌రెడ్డి, పిట్టల జాకీర్, గోరుమానుకొండ సర్పంచ్ కోడె వెంకటేశ్వర్లు, నాయకులు వలిబాషా, మనోహర్ రోగులకు అన్నదానం చేశారు. వైస్ ఎంపీపీ రంగస్వామి, నాయకులు శేఖరయ్య, గూని నాగరాజు, ఎద్దులన్న, కిరణ్, ఖాజా, సలీమ్ పాల్గొన్నారు. బుగ్గానిపల్లెలో నగర పంచాయతీ వైస్ చైర్మన్ నాగ వెంకటేశ్వర్లు, వార్డు కౌన్సిలర్ మధు, మాజీ ఎంపీటీసీ రంగస్వామి నివాళులర్పించారు.

కందిలో అంతర పంటలు లాభదాయకం

కొలిమిగుండ్ల: కంది పంట సాగు చేసే రైతులు అంతర పంటల కింద మినుము, కొర్ర, మొక్కజొన్న, పెసర తదితర పంటలు సాగు చేసుకోవాలని ఇన్‌చార్జ్ వ్యవసాయాధికారి నాగేంద్ర ప్రసాద్ సూచించారు. మంగళవారం జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి హేమసుందరరెడ్డితో కలిసి కొలిమిగుండ్ల, మీర్జాపురం గ్రామాల్లో పొలం బడి కార్యక్రమం నిర్వహించారు. ప్రస్తుతం ఆయా గ్రామాల్లో సాగులో ఉన్న పంటలు, వర్షపాతం గురించి రైతులతో చర్చించారు. సేంద్రియ పద్ధతులతో కంది పంట సాగు చేస్తే మార్కెట్‌లో గిట్టుబాటు ధర లభిస్తుందన్నారు. శనగ సాగు చేసే రైతులు ఖరీఫ్‌లో పొలాలను ఖాళీగా ఉంచకుండా స్వల్ప కాలిక పంటలైన కొర్ర, మినుము, పెసర పంటలు వేయాలని సూచించారు. వేసవి దుక్కులు చేసుకుని భూసార పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. ఏఈఓలు నాగరాజు, వనిత, వ్యవసాయ సహాయకురాలు శాంతి పాల్గొన్నారు.

అడ్డుకున్నవారిపై చర్యలు తీసుకోవాలి

ప్యాపిలి: మండల పరిధిలోని వెంగళాంపల్లి గ్రామంలో జరిగిన మొహర్రం వేడుకల్లో తమను చావిడిలోకి రాకుండా అడ్డుకున్నవారిపై చర్యలు తీసుకోవాలని మందకృష్ణ మాదిగ వర్గం నాయకులు సుందరం, ఆవుల రామకృష్ణ తదితరులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో సీఐ వెంకటరామిరెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. మొక్కులు చెల్లించుకోవడానికి పీర్ల చావిడిలోకి వెళ్తున్న దళితులను నలుగురు వ్యక్తులు అడ్డుకున్నారని వాపోయారు. విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ట్రాఫిక్‌కు అంతరాయం

కొలిమిగుండ్ల: కనకాద్రిపల్లె బస్టాప్ సమీపంలోని ప్రధాన రహదారిపై మంగళవారం ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడడంతో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. పాలీష్ ఫ్యాక్టరీలో రాళ్లు లోడ్ చేసుకున్న లారీ వెనక్కి వచ్చే క్రమంలో ప్రధాన రహదారిపై సాంకేతిక కారణాలతో ఆగిపోయింది. రోడ్డు మధ్యలో నిలిచిపోవడంతో బైక్‌లు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. అనంతపురం–అమరావతి జాతీయ రహదారి కావడంతో నిమిషాల వ్యవధిలోనే వాహనాలు బారులు తీరాయి. సుమారు రెండు గంటల పాటు వాహనాలు నిలిచిపోవడంతో రాకపోకలు సాగించే వాళ్లు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చివరకు పాలీష్ రాళ్లను మరొక లారీకి మార్పు చేసి ఆగిపోయిన లారీని పక్కకు తీయడంతో ట్రాఫిక్ సమస్య తొలగిపోయింది.



మరమ్మతులకు గురై రోడ్డుకు అడ్డంగా నిలిచిపోయిన లారీ

అంటువ్యాధులతో తస్మాత్ జాగ్రత్త

డోన్: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి మధుసూదన్‌రావ్ అన్నారు. పట్టణంలోని శ్రీనివాసనగర్‌లో మంగళవారం వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. డెంగీ, మలేరియా, చికెన్ గున్యా లాంటి వ్యాధుల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా దోమల నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి సూచనలు చేశారు. డ్రమ్ములు, గచ్చుల్లో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తపడాలని సూచించారు. నీటిని కాచి వడబోసిన తర్వాతే తాగాలన్నారు. కలుషితమైన నీటి వల్ల వాంతులు, విరేచనాలు, టైఫాయిడ్, పచ్చకామెర్లు వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందని హెచ్చరించారు.

ఒకే రోజులో త్రిలింగ దర్శనం

డోన్ టౌన్: ఆషాఢ మాసం సందర్భంగా భక్తుల సౌకర్యార్థం డోన్ ఆర్టీసీ డిపో నుంచి మహానంది, యాగంటి, అహోబిలం దేవాలయాలకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు డిపో మేనేజర్ శశిభూషణ్ తెలిపారు. ఈ నెల 12, 13, 20, 27 తేదీల్లో ఈ ప్రత్యేక దర్శన బస్సులు అందుబాటులో ఉండనున్నాయని మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. డోన్ కొత్త బస్టాండ్ నుంచి ఉదయం 6 గంటలకు బయలుదేరే బస్సు నంద్యాల, మహానంది, ఆళ్లగడ్డ, అహోబిలం, కొయిలకుంట్ల, బనగానపల్లె, యాగంటి మార్గంలో ప్రయాణించి రాత్రి 7 గంటల వరకు తిరిగి డోన్‌కు చేరుకుంటుందన్నారు. ప్రతి ప్రయాణికుడి నుంచి రూ.400 చార్జీ వసూలు చేయనున్నట్లు వెల్లడించారు. టిఫిన్, భోజన ఖర్చులు ప్రయాణికులే భరించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. అడ్వాన్స్ రిజర్వేషన్ సౌకర్యం కూడా కల్పించినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆర్టీసీ కార్మికుల నిరసన

బనగానపల్లె: స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ ఏకపక్ష వైఖరి, నిర్లక్ష్య ధోరణికి నిరసనగా మంగళవారం ఆర్టీసీ కార్మికులు ఎర్రబ్యాడ్జిలతో విధులకు హాజరై నిరసన వ్యక్తం చేశారు. నేషనల్ మజ్దూర్ యూనియన్ డిపో కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ.. ప్రయాణికులు, విద్యార్థుల రద్దీకి తగినంతగా బస్సులు నడపాల్సిన అవసరం ఉన్నప్పటికీ, డిపో మేనేజర్ తగిన చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. షెడ్యూల్‌లో ఉన్న సర్వీసులు సైతం నడపకపోవడం వల్ల ప్రజలు తీవ్ర అసౌకర్యానికి లోనవుతున్నారని అన్నారు. పలు సమస్యలపై విన్నపాలు ఇచ్చినా, అవేవీ పరిగణనలోకి తీసుకోకుండానే ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కార్మిక నాయకులు ఎస్ఎస్ వలి, జంబులయ్య, ఓబులేసు, సలామియ్యా, ప్రహ్లాదు పాల్గొన్నారు.



డిపో ప్రాంగణంలో నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

సంక్షిప్తం

మార్కెట్ కమిటీ చైర్మన్‌గా మల్లికార్జునరెడ్డి

కర్నూలు(అగ్రికల్చర్): బనగానపల్లె వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలక వర్గాన్ని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మార్కెట్ కమిటీ గౌరవ చైర్మన్‌గా ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి, చైర్మన్‌గా కట్రెడ్డి మల్లికార్జున రెడ్డి, వైస్ చైర్మన్‌గా కేఎం భూషన్న నియమితులయ్యారు. సభ్యులుగా నర్సిబాయి, డి.ప్రవీణ్, గుండం మల్లికార్జునరెడ్డి, సుజాత, కె.రాధిక, మారం పుల్లారెడ్డి, ఎం.రమణయ్య, దూదేకుల పెద్ద దస్తగిరమ్మ, తెలుగు యల్లేశ్వరి, పవన్ కుమార్‌రెడ్డి, సరస్వతి, మహబూబ్ బాషా, తలారి లక్ష్మీదేవి నియమితులయ్యారు.

మంచినీటి సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్: గాజులదిన్నె ప్రాజెక్టు పైప్‌లైన్ లీకేజీ కారణంగా ఈ నెల 10వ తేదీ గురువారం పట్టణంలో మంచినీటి సరఫరాలో అంతరాయం ఉంటుందని మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరిగి 11వ తేదీ నుంచి యథావిధిగా సరఫరా జరుగుతుందని.. ప్రజలు నీటిని పొదుపుగా వినియోగించాలని పేర్కొన్నారు.

దివ్యాంగుల నుంచి 300 దరఖాస్తులు



బనగానపల్లె రూరల్: దివ్యాంగులు, వయోవృద్ధులకు ఉచితంగా సహాయ పరికరాలు అందజేసేందుకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో పేర్ల నమోదు కోసం మంగళవారం ప్రత్యేక శిబిరం జరిగింది. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు 300 మంది దరఖాస్తు చేసుకున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నాగరాజు తెలిపారు.

సమస్యలపై వినతి

బనగానపల్లె రూరల్: దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలని జిల్లా దివ్యాంగుల సంఘం జేఏసీ నాయకులు వయోవృద్ధుల సంక్షేమశాఖ ఏడీ ఫాతిమాకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. జేఏసీ అధ్యక్షుడు అదరం దేవరాజు మాట్లాడుతూ.. దివ్యాంగులకు పింఛన్ తప్ప ఇతర సంక్షేమ పథకాలు అందడం లేదన్నారు. రుణాలు, త్రీ వీలర్స్ స్కూటీ మంజూరులో డిగ్రీ అర్హత తొలగింపు తదితర సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు.

రేపు శాకంబరీ ఉత్సవం

బేతంచెర్ల: మండల పరిధిలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో ఈనెల 10న ఆషాడ పౌర్ణమిని పురస్కరించుకుని మహాలక్ష్మి అమ్మవారికి శాకంబరీ ఉత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ రామాంజనేయులు తెలిపారు. అమ్మవారి మూలమూర్తిని వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలు, పలు రకాల పండ్లతో అలంకరించనున్నట్లు చెప్పారు. కుంకుమార్చన, ప్రత్యేక పూజలు జరుగుతాయని పేర్కొన్నారు.

పశుగ్రాసంతో ఆదాయం



అవగాహన కల్పిస్తున్న ఏడీఏ నాగరాజు

డోన్: పశుగ్రాసం లేకుండా పాడిపరిశ్రమలో లాభాలు సాధ్యపడవని, ప్రతి రైతు తన భూమిలో కనీసం పదవ వంతు భాగాన్ని పచ్చిమేతకు కేటాయించాలని ప్రాంతీయ పశువైద్యశాల సంయుక్త సంచాలకులు నాగరాజు సూచించారు. మంగళవారం పశుగ్రాస వారోత్సవాల సందర్భంగా స్థానిక పశువైద్యశాల ఆవరణలో నిర్వహించిన అవగాహన సదస్సును ఆయన ప్రారంభించారు. పచ్చిమేత సాగుతో పశువులకు పోషకాహారం అందడం ద్వారా పాడి ఉత్పత్తి పెరుగుతుందని తెలిపారు. ఇదే రైతుకు లాభాలు తెస్తుందన్నారు. సూపర్ నేపియర్ వంటి పశుగ్రాస పంటల ద్వారా ఎక్కువ పచ్చిమేత ఉత్పత్తి చేసుకోవచ్చని తెలిపారు. జాతీయ ఉపాధిహామీ పథకం కింద అర్ధ ఎకరాలో పచ్చిమేత సాగు చేస్తే రైతుకు రూ.32,500 వరకూ లాభం లభిస్తుందని తెలిపారు. ఈ పథకం కింద 100 శాతం సబ్సిడీ వర్తిస్తున్నందున రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

రైతన్న నేస్తాలు



గుళ్లదూర్తిలో నారుమడిలో వాలిన కొంగలు



పొలంలో పురుగులను తింటున్న కొంగలు

ఈ ఏడాది జూన్ నుంచి ఖరీఫ్ సాగు ప్రారంభమైందంతో కుందూ నది, పాలేరు, కుందరవాగు, బోర్లు వంటి నీటి వనరులు ఉన్న ప్రాంతాల్లో రైతులు వరి సాగుకు సిద్ధమవుతున్నారు. కోవెలకుంట్ల వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని ఆయా ప్రాంతాల్లో నీటిని పొలాలకు మళ్లిస్తూ నారుమడులను సిద్ధం చేస్తున్నారు. ఇలాంటి సమయంలో వరి నారుమడుల్లో కొంగలు రైతన్నకు తమ వంతు సహకారం అందిస్తున్నాయి. మండలంలోని గుళ్లదూర్తి సమీపంలో రైతులు నారుమడి పనుల్లో నిమగ్నం కాగా కొంగలు మడుల్లో వాలి పైరుకు చేటు చేసే క్రిమి కీటకాలు, పురుగులను తింటూ ఆకలి తీర్చుకవడమే కాకుండా రైతులకు తమ వంతు సాయం చేస్తూ నేస్తాలయ్యాయి. ఈ దృశ్యాలు ప్రకృతి రమణీయతకు, జీవ వైవిధ్యానికి అద్దం పడుతున్నాయి. –కోవెలకుంట్ల